# ఆప్తమిత్రులు

భూషయ్యా, భుజంగరావూ ఆప్తమిత్రులు. ఇద్దరిదీ ఒకేఊరు.

వారిది ఇరుగూ పొరుగూ కాకపోయినా, వాళ్ళ స్నేహాన్ని గట్టిపర్చింది తుమ్మగుంట పొలం. అక్కడ గట్టు హద్దుగా చెరి మూడెకరాల శేరీ మాగాణిభూమి ఉంది. ఇద్దరూ వ్యవసాయదారులే. ఊడ్పుల దగ్గర్నుంచీ మాసూలువరకూ ఇద్దరూ చేదోడు వాదోడుగా సేద్యపు పనుల్ని చేసుకుంటూ వుంటారు. వాళ్ళ సఖ్యతా, స్నేహమూ అక్కడే అరంభమైంది. ఆయేటి కాయేడు అది కొమ్మలూ రెమ్మలూవలె వృద్ధిచెందింది. ఒక తల్లి బిడ్డలు కాకపోయినా, అంతకు మరింత యిదిగా అన్నదమ్ములవలె మెలుగుతూ ఉంటారు.

భూషయ్యకు ఇద్దరు కొడుకులు, పెద్దవాడు ఇంజనీరింగ్ ఫైనల్ యియర్ చదువుతున్నాడు. రెండోవాడు మెడిసిన్, పెద్దవాడు పెళ్ళీడుకొచ్చాడు.

భుజంగరావుకు ముగ్గురు కొడుకులు. పెద్దవాడు ఇంజనీరింగ్ ఫైనల్ యియర్ చదువుతున్నాడు. రెండోవాడు మెడిసన్. మూడోవాడు పి. యు. సి. పెద్దవాడు పెళ్ళివయస్సులోనే ఉన్నాడు.

భుజంగరావుకంటె భూషయ్యే స్థిర చరాస్తులలో మిన్న. భూషయ్యకంటె భుజంగరావు ఓ మోతాదు ఎక్కువ వ్యవహార దక్షత గలవాడు. భూషయ్య చదువు వీధిబడి దాటలేదు. భుజం

గరావు సర్కారువారి బడిలోకూడా రెండేండ్లు చదువు కున్నాడు.

మిత్రు లిద్దరూ తమతమ పెద్దకొడుకుల్ని ఓ ఇంటివాళ్ళని ఆయేడు చేయాలని ఉవ్విళ్ళూరుతున్నారు.

ఆరోజు కడసంజెవేళ మిత్రులిద్దరూ తుమ్మగుంట పొలం దగ్గర్నుంచి ఊళ్లోకి వస్తున్నారు

"భూషయ్యా! పాలెం మున్సబు నీకు ఎరుకగదూ! ఆయనకు పెళ్ళీడుకొచ్చిన ఓ పిల్ల ఉంది. పుత్తడి బొమ్మ కట్నంకూడా 'ల'కారంమీదే! గుంటూరులో స్త్రీల కళాశాలలో బి. ఏ; మూడో సంవత్సరం చదువుతూన్నదట. గుణవతీ, రూపవతీ, విద్యావతీ; ఆ పైన ధనలక్ష్మి - ఆ పిల్లను మా పెద్దవాడికి ఇస్తామంటూ మున్సబు కబురు చేశాడు." అన్నాడు భుజంగరావు తాపీగా.

"ఏమన్నావ్?" అన్నాడు భూషయ్య ఆదుర్దాగా.

"అక్కర్లేదన్నాను." అన్నాడు భుజంగరావు పట్టు కత్తి రించినట్టు.

భూషయ్యకు గుటక పడలేదు. "ఏం?"

"అక్కడే ఉంది అసలు కిటుకు. అందరూ నన్ను పిచ్చివాడి క్రింద జమకడతారు. నిజం తెలుసుకుంటే నన్నే వ్యవహారజ్ఞాని అంటారు. మా బావమర్ది అంతా వాకబుచేసి, నా చెవిలో అసలు రహస్యాన్ని వూదాడు. ఆ పిల్ల జాతకంలో పెళ్ళి అయిన అయిదేళ్ళకు వైధవ్యం వ్రాసిపెట్టబడి ఉందట. అంటే ఆ జాతకప్రభావంవల్ల ఆమెను కట్టుకున్న మొగుడు అయిదే ళ్ళలో 'హరీ' అనవల్సిందేగదా! చూస్తూ చూస్తూ ఆ సంబంధం చేసి ఏ తండ్రి తన కొడుకు మరణాన్ని కోరుకుంటాడు? ఏమం టావు భూషయ్యా?" అన్నాడు భుజంగరావు.

భూషయ్యకు గుటక పడింది "అవును, మరి అంతే!"

ఆ మిత్రు లిద్దరిమధ్యా ఆ సంభాషణ జరిగిన వారం రోజులకు భూషయ్య ఇంటికి పాలెం మున్సబు దగ్గర్నుంచి ఓ పెళ్ళిళ్ళ పేరయ్య వచ్చాడు. మున్సబుగారు తమ అమ్మాయిని లక్ష రూపాయల కట్నంతో ఇంజనీరింగ్ చదివే భూషయ్యగారి పెద్ద బ్బాయికి ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్టు తెలియబర్చాడు. భూషయ్యకు వెన్నుపాము విరిగినట్టై, ససేమిరా ఆ సంబంధం తమ కొద్దని మొహంపై పేడనీళ్లు చల్లినట్టుగా చెప్పాడు. పాపం! ఆ పెళ్ళిళ్ళ పేరయ్యకు నిలువునా నడుములు క్రుంగగా, కాళ్ళీడ్చుకుంటూ భుజంగరావు దగ్గర కెళ్ళి, ఓ గంటసేపు ముచ్చట్లు ఆడాడు. ఆ పిమ్మట పాలెం వెళ్ళాడు.

ఓ నెలరోజులతర్వాత పాలెంమున్సబు కూతురికీ భుజంగరావు పెద్దబ్బాయికీ పెద్దల సమక్షాన వైభవంగా వివాహంజరిగింది.

తలవాకిటి చావడి దూలం నుదురుకు కొట్టుకున్నంతగా దిమ్మరపోయాడు భూషయ్య.

"ఏమిటి భుజంగరావ్! ఆ పిల్ల జాతకంలో పెళ్ళి అయిన అయిదేళ్ళకు వైధవ్యం ఉందని నాతో అన్నావ్. మరి చూస్తూ చూస్తూ నీ కొడుక్కి చేసుకున్నావేం?"

తన మిత్రుని అమాయకత్వానికి భుజంగరావు చిక్కగా చిరునవ్వు నవ్వాడు.

అదేమో నాకు వివరంగా తెలియదు. మా వాడి జాతకాన్ని తిరగవేశాను. వాడికి పెళ్ళి అయిన అయిదేళ్ళకే ద్వితీయ వివాహమున్నట్లు ఖచ్చితంగా ఉంది."

భూషయ్యకు నో రెండిపోయింది.

(యువ)